

## మున్సిపల్ కమిషనర్ గా మధుసూదన్ రెడ్డి



**ప్రజాశక్తి- పుంగనూరు:** పుంగనూరు మున్సిపల్ కమిషనర్‌గా మధుసూదన్ రెడ్డి బదిలీపై వచ్చి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన కమిషనర్ నరసింహ ప్రసాద్ పదోన్నతిపై చిత్తూరు కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ధర్మవరంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న మధుసూదన్ రెడ్డి పుంగనూరుకు బదిలీపై వచ్చారు. 2019లో 8 నెలలపాటు మున్సిపల్ కమిషనర్‌గా మధుసూదన్ రెడ్డి పుంగనూరులో విధులను నిర్వర్తించారు. తిరిగి పుంగనూరు బదిలీపై రావడంతో పట్టణంపై కొంతమేరకు అవగాహన కలిగి ఉన్నారు.

వరద ప్రాంతాల్లో చిత్తూరు ఎంఎల్ఏ, మున్సిపల్ అధికారులు, కార్మికులు

# మేము సైతం



వరద ప్రాంతాల్లో సేవలందిస్తున్న చిత్తూరు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** నేను సైతం.. అంటూ చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుతో వరద ముంపుకు గురైన విజయవాడలోని 16వ వార్డు కృష్ణలంక పరిసరి ప్రాంతాల్లో పర్యటించి వరద బాధితులను పరామర్శించారు. వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఆదుకుంటుందని భరోసా కల్పించారు. అలాగే జీజేఎం ట్రస్ట్ ద్వారా వరద బాధితులకు ఎంఎల్ఏ కార్యాలయ సిబ్బంది నిత్యావసర సరకులను పంపేందుకు బియ్యం, కూరగాయలు, వాటర్ బాటిల్స్‌ను సిద్ధం చేసి పంపుతోంది. ఎంఎల్ఏతో పాటు టిడిపి నాయకులు సునీల్‌కుమార్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**సహాయక చర్యల్లో చిత్తూరు మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు**

విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో సత్వర పారిశుద్ధ్య సేవలను అందించడం కోసం చిత్తూరు నగరపాలక సంస్థ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు తరలివెళ్లారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వేగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టడం కోసం చిత్తూరు నగరపాలక సంస్థ నుండి నలుగురు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, నలుగురు మేస్త్రీలు, 63 మంది పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం రాత్రి ప్రత్యేక బస్సుల్లో విజయవాడకు తరలివెళ్లారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, శానిటరీ ఇన్స్పెక్టర్లు పారిశుద్ధ్య పనుల కోసం కావాల్సిన అన్ని సామగ్రి సమకూర్చి కార్మికులకు దిశానిర్దేశం చేసి విజయవాడ పంపారు. వీరు బుధవారం ఉదయం విజయవాడ చేరుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు.. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, నూతన కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆధ్వర్యంలో విజయవాడ పట్టణంలోని 16వ వార్డు పరిధిలోని రామలింగేశ్వర కట్ట, పోలీసు కాలనీ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమయ్యారు. వరద కారణంగా పేరుకుపోయిన బురద, మట్టిని తొలగిస్తూ శుభ్రతాపనులు చేపడుతున్నారు. దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లడంతో పాటు దోమలు విజృంభించకుండా స్ప్రేయింగ్, ఫాగింగ్ పనులు చేస్తున్నారు. వరద కారణంగా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న స్థానికులకు వీలైనంత వేగంగా స్వాంతన చేకూర్చేలా చిత్తూరు నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు, పారిశుద్ధ కార్మికులు కృషి చేస్తున్నారు.

**వరద బాధితుల కోసం.. పది బస్తాల బియ్యం..**





ముంపు పాంతాల్లో పర్యటిస్తున్న చిత్తూరు ఎంఎల్ఏ, ఆహారం, వాటర్ బాటిళ్లు వాహనాల్లో పంపుతున్న డిఆర్‌డిఏ

విజయవాడ వరద బాధితుల సహాయార్థం చిత్తూరు నగరపాలక సంస్థ వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ కార్యదర్శులు తమ వంతు సాయంగా పది బస్తాల బియ్యాన్ని అందించారు. వరదలతో అతలాకుతలమై సర్వం కొల్పోయిన బాధితులకు తమ వంతు సాయం చేయడానికి నడుం బిగించారు. కార్యదర్శులు అందరూ కలిసి రూ.10,000 విలువైన పది బస్తాల బియ్యాన్ని సాయంగా అందించారు. రాష్ట్ర ప్రభుత్వం, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపుమేరకు పది బస్తాల బియ్యాన్ని బుధవారం ఎమ్మెల్యే వారి కార్యాలయంలో అప్పగించారు. చిత్తూరు నగరపాలక సంస్థ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

**వరద బాధితులకు డిఆర్‌డిఏ సాయం**

విజయవాడ ప్రాంత వరద బాధితుల ఆకలి కష్టాలు తీర్చేందుకు చిత్తూరు గ్రామీణ అభివృద్ధి సంస్థ, జిల్లా సమాఖ్య ముందుకొచ్చి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. వరదల కారణంగా బెజవాడ ప్రజలు సకలం కోల్పోయి అష్టకష్టాల పడుతున్న నేపథ్యంలో వారికి సాయం అందించాలన్న సంకల్పంతో చిత్తూరు డిఆర్‌డిఏ, జిల్లా సమాఖ్య ముందుకొచ్చింది. డిఆర్డిఏ పిడి తులసి మాట్లాడుతూ భారీ వర్షాలు వరదలతో అతలాకుతలం అవుతున్న విజయవాడ ప్రాంత ప్రజల ఆకలి కష్టాలను తీర్చాలన్న ఉద్దేశంతో ఒంగోలులో ప్రత్యేకంగా శిబిరం ఏర్పాటు చేసి, అందులో ఆహారం తయారు చేయించి, పదివేల ఆహార పొట్లాలతో పాటు, పదివేల వాటర్ బాటిల్స్‌ను, 20 వేల బిస్కెట్ ప్యాకెట్లను అందించాలని నిర్ణయించామన్నారు. ఒంగోలు తయారు చేసిన భోజన పొట్లాలు, వాటర్ బాటళ్ల ను, బిస్కెట్ ప్యాకెట్లనుప్రత్యేక వాహనంలో విజయవాడకు పంపి వరద బాధితులకు అందించనున్నట్లు తెలిపారు.

## బుడమేరు బాధితులకు బుడతల సాయం



**కార్వేటినగరం:** విజయవాడలో బుడమేరు బాధితులను ఆదుకోవడానికి శ్రీలక్ష్మీనరసింహా పాఠశాల బుడతలు (చిన్నారులు) మేము సైతం అంటూ బుధవారం మండల కేంద్రంలో హుండీ ద్వారా విరాళాలు సేకరించారు. మండల కేంద్రంలోని కార్యాలయాలు, వ్యాపార వేతలు, దుఖాణాల వద్ద చందాలు వసూళ్ల చేయడంతో చిన్నారుల సేవలను గుర్తించిన పలువురు వారిని అభినందిస్తూ వారికి ఆర్థిక సహాయాన్ని అందించారు.

## వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

త్వరలో గైనకాలజిస్ట్‌ను కేటాయిస్తాం: కలెక్టర్




పుంగనూరు ఏరియా ఆసుపత్రి వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

**ప్రజాశక్తి- పుంగనూరు**

వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. పుంగనూరు ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుంగనూరు ఏరియా ఆసుపత్రి పనితీరు, వైద్యులు, సిబ్బంది సమయ పాలనను పరిశీలించడం జరిగిందని తెలిపారు. ప్రతి రోజు ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్యను వారికి అందిస్తున్న వైద్య సదుపాయాలను పర్యవేక్షించామన్నారు. ఆసుపత్రికి సంబంధించి అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలను పూర్తి చేయడం జరుగుతుందని, ఆసుపత్రి నిర్వహణకు అవసరమైన నిధులు త్వరలో మంజూరు చేస్తామన్నారు. స్త్రీల సమస్యలు, గర్భిణీ స్త్రీలకు వైద్యం అందించడానికి గైనకాలజిస్ట్‌లను కేటాయిస్తామన్నారు. అత్యవసర చికిత్సకు అందుబాటులో ఉండేలా వైద్యాలను ఆదేశించడం జరిగిందన్నారు. ఆసుపత్రిలో ఉన్న సదుపాయాల మేరకు మెరుగైన వైద్యచికిత్స అందించాలని, తప్పనిసరి పరిస్థితిలోనే ఇతర ఆసుపత్రికి రెఫర్ చేయాలన్నారు. వైద్యసిబ్బంది హాజరు పూర్తిస్థాయిలో ఉండాలని, మెరుగైన వైద్యచికిత్స అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించామన్నారు. చికిత్సకు అవసరమైన మందుల కొరత కొంతమేర ఉందని తెలిసిందని, త్వరలో పరిష్కరిస్తామన్నారు. అత్యవసర చికిత్సల కోసం ఆసుపత్రికి వచ్చే రోగులకు సపరేటు రిజిస్టర్ మెయింటైన్ చేయాలని వారి పూర్తి వివరాలు అందులో నమోదు చేయాలన్నారు. ఏ సమస్య వలన మెరుగైన వైద్యం కోసం పంపుతున్నారన్న విషయం అందులో కనపరచాలన్నారు. ఇకపై అప్పుడప్పుడు ఆసుపత్రులు తనిఖీ చేయడం జరుగుతుందని చెప్పారు.

దమ్ మారో దమ్..

# జీవితం ఖతమ్..




- పట్టణాలు, గ్రామాలను కమ్మేస్తున్న మత్తు
- బానిసలవుతున్న యువత
- నివారించడంలో విఫలమవుతున్న యంత్రాంగం

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్**

యువతే లక్ష్యంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు పట్టణ, గ్రామీణ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు స్వార్థపరులు అక్రమార్జన కోసం పట్టణ గ్రామీణ ప్రాంత యువతను పెడదారిపట్టి వారి భవిష్యత్తును నాశనం చేయిస్తున్నారు. పట్టణ ప్రాంతాలకే పరిమితమైన గంజాయి, నాటుసారా ఇతర మత్తు పదార్థాలు గ్రామీణాలను సైతం వదలకుండా గ్రామీణ యువతను టార్గెట్ చేస్తూ స్వచ్ఛమైన గ్రామాలను మత్తుతో కలుషితం చేస్తున్నాయి.

గంజాయి వంటి మత్తు పదార్థాలను పల్లెలకు సైతం రవాణా చేసి వ్యాపారాన్ని విస్తరిస్తూ అక్రమమార్గలో లక్షలు గడిస్తున్న అక్రమార్కులు యువత జీవితాలతో చెలగాటమాడుతున్నారు. భావితరాల భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. అక్రమార్జనే ధ్యేయంగా సాగుతున్న వికృత క్రీడలో వేలాది కుటుంబాలు చిక్కి నాశనమవుతున్నాయి. గంజాయి, సారా రవాణాలను అరికట్టి అక్రమార్కులకు అడ్డుకట్ట వేయాల్సిన యంత్రాంగం ఆ దిశగా గట్టి చర్యలు చేపట్టకపోవడంతో జిల్లా సరిహద్దు రాష్ట్రాల నుంచి మత్తు పదార్థాలు జిల్లా కేంద్రమైన చిత్తూరు పరిసర ప్రాంతాల్లో విచ్చలవిడిగా అమ్మకాలు సాగుతున్నాయి. కర్ణాటక, తమిళనాడు సరిహద్దు జిల్లా కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి చిత్తూరు జిల్లాలోకి మత్తు పదార్థాలను తీసుకొచ్చి యువతే లక్ష్యంగా విక్రయాలు సాగుతున్నాయి. యువతతో పాటు విద్యార్థులను కూడా ఈ ఉచ్చులోకి లాగుతున్నారు.

జిల్లా కేంద్రానికి అతి సమీపంలోని గుడిపాల మండలంలో నాటు సారా తయారీ కూడా భారీగా సాగుతోంది. ఇక్కడి నుంచే జిల్లాలోని ఇతర ప్రాంతాలకు నాటు సారా సరఫరా అవుతుండటంతో ఎక్సైజ్ శాఖ అధికారులు చేపడుతున్న దాడుల్లో గుడిపాల పరిసర ప్రాంతాల నుండి ఎక్కువ కేసులు నమోదయ్యాయి. చిత్తూరు నగరంతో పాటు పలమనేరు, కుప్పం ఇతర ప్రాంతాల్లో కూడా గంజాయి కేసులు వెలుగు చూస్తున్న ఒక్కరు ఇద్దరిని అదుపులోకి తీసుకొని వదిలేయడంతో గంజాయి విక్రయాలను పూర్తిస్థాయిలో అదుపు చేయలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. యువతను గంజాయి మత్తులో ముంచుతున్న భారీ స్థాయిలో తరలిస్తున్న స్మగ్లర్లను అదుపు చేయడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది.. అప్పుడప్పుడు ఒక్కరిద్దరినీ అరెస్టు చేసి చేతులు దులుపు కుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి.






**విద్యార్థులనూ వదలక..**

గంజాయి విక్రయించే ముఠా విద్యార్థులను లక్ష్యంగా చేసుకోని అమ్మకాలు చేస్తున్నారు. చిత్తూరు పట్టణంతో పాటు పరిసర మండల కేంద్రాల్లో ఈ సంస్కృతి బాగా పెరిగిందనే దానికి ఉదాహరణలు ఇటీవల పట్టుబడుతున్న మాదకద్రవ్యాలే.. బడి.. గుడి.. అని తేడా లేకుండా జోరుగా మత్తుపదార్థాల వ్యాపారాలు సాగుతున్నాయి. పలమనేరు, వీకోట, కుప్పం ఇతర ప్రాంతాల్లో కూడా చాటుమాటుగా పోలీసుల కళ్ళుగప్పి గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణ శివార ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో కళాశాల విద్యార్థులు రాత్రులలో రోడ్లపైనే గంజాయి తాగుతూ మత్తులో తూగుతుంటే గ్రామస్తులు ముక్కున వేలు వేసుకుంటున్న పరిస్థితి. యువత, విద్యార్థుల భవిషత్తును నాశనం చేస్తున్న మత్తుపదార్థలపై పోలీస్ యంత్రాగం దృష్టి సారించి కట్టడి చేయడంతో పాటు మత్తు పదార్థలు తరలిస్తు పట్టుబడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం


విలేకర్ల సమావేశంలో కలెక్టర్, ఎస్పీల హెచ్చరిక



**ప్రజాశక్తి- వీకోట:** రాజకీయ లబ్ధి కోసం కొంతమంది స్వార్థపరులు మతాల మధ్య గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు హెచ్చరించారు. వికోట పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు రోజులు మండల కేంద్రమైన వికోటలో రెండు వర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ శాంతిభద్రతలకు విభాగం కలిగిందని తెలిపారు. దీనిని కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం మతాల మధ్య గొడవలుగా సృష్టించేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అల్లరి మూకల దాడిలో నష్టపోయిన చిరు వ్యాపారులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పట్టణంలో రెండు వర్గాలతో పీస్ కంపెనీ ఏర్పాటు చేశామని వారితో చర్చించి రాబోవు వినాయక చవితిని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. చట్టాలను అతిక్రమించి దాడులకు పాల్పడే వారిని గుర్తించామని వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పి హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికగా ఎటువంటి రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఘర్షణలను ప్రోత్సహించి రెచ్చగొట్టే వారిపై పిడి యాక్ట్ పెట్టేందుకు కూడా వెనకాడేది లేదని తెలిపారు. దశలవారీగా పట్టణంలో 144 సెక్షన్‌ను సడలిస్తామన్నారు. ప్రజలందరూ సమన్వయంతో సోదరుభావంతో సామాన్య ప్రజలకు భరోసా కల్పించే విధంగా నడుచుకోవాలని ఇరు వర్గాల వారికి కలెక్టర్ పిలుపునిచ్చారు.

**అభ్యంతకర పోస్టులు పెడితే కఠిన చర్యలు : డీఎస్పీ ప్రభాకర్**

పట్టణంలో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని పలమనేరు డిఎస్పి ప్రభాకర్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్పీ మాట్లాడారు. వీ కోటలో రెండు రోజులు క్రితం ఇరు కుటుంబాల మధ్య చోటు చేసుకున్న వివాదాన్ని ఇరు వర్గాల మధ్య ఘర్షణగా చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో వీకోటలో పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందన్నారు. కొందరు పనిగట్టుకుని సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాన్ని పోస్ట్ చేస్తున్నారని అలాంటి వదంతులను ప్రజలు ఎవరు నమ్మవద్దు అని తెలిపారు. ప్రజలందరూ అన్నదమ్ములా కలిసి ఉన్నారని ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే అభ్యంతరక పోస్టులు ఎవరు పెట్టినా వారిపై పోలీసు నిఘా పెట్టి బాధ్యులను కఠినంగా శిక్షిస్తామన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

## కాదేదీ..కబ్జాకు అనర్హం..

- వాగులూ.. వంకలూ.. వదలరా..?
- చెరువే లేదు.. మొరవ కాలువ అవసరమా...?
- అమ్ముకున్నాం... సొమ్ము చేసుకున్నాం...
- దర్జాగా కబ్జాలు చేస్తున్న ఆక్రమణదారులు
- నిద్రావస్థలో అధికారులు

**ప్రజాశక్తి- కుప్పం టౌన్:** ప్రభుత్వ భూమి ఏదైనా కబ్జాకు అనర్హం కాదన్న ధోరణిలో కబ్జాదారులు ప్రవర్తిస్తున్నారని కుప్పం ప్రజలు ఆరోపిస్తున్నారు. చెరువే లేదు.. ఇక మొరువ కాలువ అవసరమా...? అనుకున్నారో...కబ్జా చేశారు.. అమ్మారు.. సొమ్ము చేసుకున్నారు... రియల్టర్లు.

చెరువులను, వాగులను, వంకలను, ప్రభుత్వ పోరంబోకు స్థలాలను రక్షించాల్సిన ప్రభుత్వఅధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు మినకుండడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. సాక్షాత్తు డివిజినల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కుప్పంలో పర్యటించి, చెరువు కబ్జాకు గురి అయిన సంగతిని నిర్ధారించి, చెరువు దురాక్రమనను తొలగించాలని ఉత్తర్వులు జారీచేసి, సుమారు దశాబ్ద కాలం పూర్తి కావస్తున్నా, వాటిని అమలు చేయాల్సిన అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం ఆక్రమణదారులకు అండగా ఉన్నట్లేనని సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్ద కాలం నాటి ఘటనలను గుర్తు చేస్తూ, ఉన్నతాధికారుల ఉత్తర్వులను స్థానిక అధికారులు అమలు చేయాలని సూచిస్తూ గత వారం రోజుల నాడు వెంకట్రామయ్య నీ చెరువును కాపాడుకోవయ్యా అన్న కథనంతో ప్రజాశక్తి దినపత్రిక ప్రజల ముందుకు తీసుకువచ్చింది. అయినా అధికారులు మాత్రం ఇవేమీ తెలియనట్టు, తమకేమీ పట్టనట్టు సంబంధిత అధికారులు వ్యవహరించడంపై పురప్రజలతో పాటు సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ప్రవర్తనపై సామాజిక కార్యకర్తల ఆగ్రహానికి నిదర్శనంగా బుధవారం వెంకట్రామయ్య చెరువు ప్రాంగణంలో నిర్మాణం జరుగుతుంది అంటూ సామాజిక మాధ్యమాలలో జరుగుతున్న ప్రచారాన్ని చెప్పుకోవచ్చు. ఇంత జరుగుతున్నా అధికారులు మిన్నకుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు, సామాజిక కార్యకర్తలు వెంటనే సంబంధిత అధికారులు జరిగిన ఘటనలను పరిగణలోనికి తీసుకుని, కబ్జాకు గురైన చెరువులను, వాగులను, వంకలను, ప్రభుత్వ పోరంబోకు స్థలాలను దురాక్రమణ నుండి తొలగించి, వాటిని పరిరక్షించాలని కోరుతున్నారు.



కబ్జాకు గురైన మొరవ కాలువ

## విద్యాప్రమాణాల పెంపుపై శ్రద్ధ పెట్టండి

ఎంపియుపి పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ సుమిత్ కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

**ప్రజాశక్తి- గంగవరం:** ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపుపై శ్రద్ధపెట్టి పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ గంగవరం మండలం మల్లేరు ఎంపియుపి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు చర్యలు చేపడుతున్నదని, ఈ దిశగా ఉపాధ్యాయులు కూడా మరింత భాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందించే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర స్టూడెంట్ కిట్లను అందిస్తున్నదని, విద్యార్థులు కిట్ ద్వారా అందిన పాఠ్య పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, యూనిఫారం, తదితర సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దీనితో పాటు విద్యాప్రమాణాల పెంపుకు ఉపాధ్యాయులు ప్రత్యేకశ్రద్ధ తీసుకుని పాఠ్యాంశాలను బోధించిన అనంతరం విద్యార్థులు ఆ పాఠ్యాంశాలకు సంబంధించి నమోదు చేసుకున్న నోటు పుస్తకాలను ఉపాధ్యాయులు పరిశీలించి తప్పొప్పులను సరిదిద్ది, విద్యార్థులకు తెలియజేయాలన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే బలమైన పునాది అని ప్రాథమిక విద్యను అభ్యసించే 1 నుండి 5వ తరగతి విద్యార్థులకు ఆటపాటల ద్వారా మెరుగైన విద్యాబోధన చేయడంలో ఉపాధ్యాయులు కీలకమని, ఈ దిశగా ఉపాధ్యాయులు పనిచేసి విద్యార్థుల విద్యాప్రమాణాల పెంపుకు తోడ్పాటును అందించాలన్నారు. విద్యతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు.

# పగలే వెన్నెల..

**రాత్రిపగలు వెలుగుతూనే ఉన్న వీధి దీపాలు**


వెలుగుతూనే ఉన్న లైట్లు

**ప్రజాశక్తి- విజయపురం**
అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగా పగలు కూడా వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. దీంతో విద్యుత్ వృధా అవుతోందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. మండలంలో చాలా గ్రామాల్లో వీధి దీపాలు రాత్రింబవళ్లు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. ఇందులో కాళికాపురం, కోసలనగరం, జంబాడతో పాటు వివిధ గ్రామాల్లో పగలు రాత్రి తేడా లేకుండా వెలుగు తుండడంతో వందలాది యూనిట్లు విద్యుత్ వృధా అవుతున్నాయి. ఫలితంగా విద్యుత్ బిల్లులు పెరిగిపోవడంతో గ్రామ పంచాయతీలు తీవ్రంగా నష్టపోతున్నాయి. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినప్పటి నుంచే ప్రతి వీధికి లైన్ అండ్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేస్తే ఇలాంటి సమస్యకు చెక్ పెట్టవచ్చునని గ్రామస్తులు తెలిపారు. అయితే ప్రభుత్వం నిరంతరం విద్యుత్‌ను అందించడానికి వేలకోట్ల వెచ్చిస్తున్నా విద్యుత్‌ను ఆదా చేయాల్సిన సంబంధిత అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీ ఆదాయం, జనాభా మేరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయగా రాత్రి పూట ఆన్‌చేసి ఉదయం పూట ఆఫ్ చేయాలి.. కానీ అలా జరగడం లేదు.. దీంతో గ్రామ పంచాయతీలకు వేల రూపాయల బిల్లులు వస్తున్నాయి. అధికారులు స్పందించి గ్రామాలలో వీధిలైట్లకు ప్రత్యేక ఆన్‌ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# రేషన్ బియ్యం.. తూకంలో మోసం..




**ప్రజాశక్తి- విజయపురం:** రేషన్ బియ్యం తూకాల్లో మోసాలకు పాల్పడుతూ చేతివాటం ప్రదర్శిస్తుండడంతో నిరుపేదలు తీవ్రంగా నష్టపోతున్నారు. విజయపురం మండలంలో మొత్తం 25 పంచాయతీ, 33 రేషన్ షాపు, 8860 కార్డులకు వాహనం ద్వారా ఇంటింటికి బియ్యం సరఫరా చేస్తున్నారు. అయితే రేషన్ బియ్యం పంపిణీలో డీలర్, ఎండీయూలు చేతివాటం ప్రదర్శిస్తున్నారని విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. ప్రతినెలా 1వతేదీ నుంచి రేషన్ కార్డుదారులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీ నుంచి ప్రతి ఎండీయూలు బియ్యాన్ని వాహనం ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే వాహనంలో ఏర్పాటు చేసిన తూకాన్ని పక్కన పెట్టి, డీలర్ వద్ద నుంచి తీసుకొచ్చుకొన్న తూకంలో రేషన్ బియ్యం లబ్ధిదారులకు అందిస్తున్నారు. తూకం స్కేలుపై పెద్ద డబ్బా, అన్నం బుట్ట పెట్టి అందులో బియ్యం వేసి పంపిణీ చేయడంతో సుమారు 2 నుంచి 4 కేజీ వరకు తూకం తేడా వస్తున్నాయని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. జంబాడలో ఓ లబ్ధిదారుడు 20 కిలో తీసుకొన్న తరువాత వాటిని ఇంటిలో తూకం వేస్తే మూడు కిలో వరకు తక్కువ ఉందని వాపోయింది.

**లక్షల్లో మోసాలు...**
ప్రతి నెలా లబ్ధిదారులకు నుంచి తూకంలో మోసా చేసి తీసుకొన్న రేషన్ బియ్యాన్ని అటు ఎండీయూ, డీలర్లు అమ్ముకొంటున్నారని, ఇలా నెలల్లో సుమారు లక్షల్లో సంపాదిస్తున్నారని ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. మండలంలో 8860 కార్డులు ఉండగా ఒక్కో కార్డుకు 3కిలో చొప్పున నెలకు 26580 కిలో దొచుకొంటున్నారు. ప్రైవేట్ మార్కెట్‌లో కిలో రూ.22 చొప్పున రూ.5,84,000లు జేబులో వేసుకొంటున్నారు. ఇప్పటికైన జిల్లా అధికారులు దీనిపై దృష్టి కార్డుదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# క్రైం న్యూస్

వివాహేతర సంబంధానికి
## ముగ్గురు బలి

**ప్రజాశక్తి- శాంతిపురం:** వివాహేతర సంబంధం కారణంగా ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని శిలామాకుల రాయి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శిలామాకుల రాయికి చెందిన రామచంద్ర 15ఏళ్ల క్రితం తన కుటుంబంతో బెంగళూరుకు వలస వెళ్లాడు. అక్కడ అంచెలంచెలుగా ఎదిగి టెంపులను కొనుగోలు చేశాడు. తన వాహనానికి గిరీష్ అనే వ్యక్తిని డ్రైవర్‌గా పెట్టుకున్నాడు. ఇదిలా ఉండగా రామచంద్రాకు గిరీష్ భార్య శోభతో వివాహేతర సంబంధం ఏర్పడింది. గిరీష్, శోభకు ఒక కొడుకు ఒక కూతురు ఉన్నారు. 15 రోజుల క్రితం రామచంద్ర శోభతో కలిసి పరారై ఇంట్లో వారికి తెలియకుండా మరోచోట కాపురం పెట్టాడు. వారి అడ్రస్‌ను గిరీష్ తెలుసుకుని వచ్చి శిలామాకులరాయిలోని రామచంద్ర తల్లి సల్లాపురమ్మకు జరిగిన విషయాన్ని చెప్పి తన కుమారుడు ఎక్కడ కనిపించిన చంపేస్తానని హెచ్చరించాడు. దీంతో మనస్తాపం చెందిన సల్లాపురమ్మ తన ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న రామచంద్ర తల్లి ఆత్మహత్య చేసుకున్న బాధను తట్టుకోలేక తన ప్రియురాలు శోభతో కలిసి రామకుప్పం మండలం వద్ద ఆత్మహత్య చేసుకున్నారు. రామచంద్రకు కోమల అనే భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమ్యూనిటీ భవనంలో
## మందుబాబుల చిందులు..!

విసిగి, వేసారుతున్న స్థానికులు



**ప్రజాశక్తి - రామకుప్పం:** మండల కేంద్రమైన రామకుప్పంలోని క్రీడోదండ రామాలయం ఎదురుగా ఉన్న కమ్యూనిటీ భవనంలో మందుబాబుల చిందులు రోజురోజుకు శృతి మించుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడి ప్రజల ఉపయోగార్థం గతంలో టిడిపి ప్రభుత్వం కమ్యూనిటీ భవన నిర్మాణానికి పూనుకుంది. నిధుల లేమితో ఈ భవన నిర్మాణం అసంపూర్తిగా మిగిలింది. అయితే గత కొంతకాలంగా రాత్రి పగలన్న తేడా లేకుండా ఆకతాయిలు మద్యం తాగుతూ స్థానికులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్న మద్యం ఖాళీ పాకెట్లను చూస్తుంటే ఇక్కడి పరిస్థితి ఇట్టే అర్థమవుతుంది. అర్ధరాత్రి వరకు ఇక్కడ మద్యం తాగుతూ.. అరుపులు కేకలతో వీధుల్లో తిరుగుతూ ఆకతాయిలు ప్రజలను ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇకనైనా పోలీసు అధికారులు ఇక్కడి మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని... అలాగే అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తిగా మిగిలి ఉన్న కమ్యూనిటీ భవన నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

టీ చవటపల్లి అర్బన్‌హెల్త్ సెంటర్‌లో
## డిఎం అండ్ హెచ్‌ఓ తనిఖీలు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి దేవి చిత్తూరు నగర పరిధిలోని టీ చవట్టపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, వ్యాక్సిన్ స్టోరేజ్ ఐఎల్ఆర్, డీప్ ఫ్రిడ్జ్‌లో వ్యాక్సిన్ నిర్వహణ, వాక్సినేషన్ రికార్డుల నిర్వహణ, మాత శిశువు సంరక్షణ సేవల లక్ష్యసాధన, ఈహెచ్‌ఆర్ నిర్వహణ దళితర రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ద్వారా చంటి బిడ్డలకు 13 ప్రాణాంతక వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని తల్లులకు తెలిపారు. బిడ్డకు వేయవలసిన డ్యుడేట్ ప్రకారం తప్పనిసరిగా వాక్సిన్ ఇప్పించాలని తెలిపారు. అన్ని వ్యాక్సిన్లు బిడ్డకు డ్యూడేట్ ప్రకారం ఇప్పించి బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు.

## ఇళ్ల నిర్మాణపనులు వేగవంతం చేయండి

**ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు:** గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండలంలో హౌసింగ్ 100 రోజుల టార్గెట్‌లో భాగంగా గత ప్రభుత్వంలో మంజూరైన గృహాలలో ఇంకా పూర్తికాని బేస్మెంట్ లెవెల్, రూఫ్ లెవెల్ రూఫ్ కాస్ట్, మొత్తం గృహాలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పూర్తిచేయాలని తెలిపారు. వేపంజేరి సచివాలయం పరిధిలోని ముసలయ్య గారి పల్లి లేఔట్‌ను పరిశీలించారు. పురోగతిలో లేని లబ్ధిదారులతో మాట్లాడి అక్టోబర్ లోపల పూర్తి చేసుకోకపోతే బిల్స్‌రావని లబ్ధిదారులకు తెలిపారు. ఈకార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో రాఘవేంద్రరాజు, హౌసింగ్ ఇంచార్జ్ దాము, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ గీత, సెక్రటరీ రవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వినోద్ పాల్గొన్నారు.

## జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వైద్యాధికారిణి సోనియా

**ప్రజాశక్తి- సోమల:** ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వర్షాలు కురుస్తున్న సందర్భంగా వర్షపు నీరు నిల్వ ఉండి మురుగునీరు వలన దోమలు ప్రబలి ప్రజలు జ్వరాల భారినపడే అవకాశం ఉందని ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని పెద్ద ఉప్పరపల్లి వైద్యాధికారిణి సోనియా అన్నారు. బుధవారం జ్వరాల భారిన పడకుండా దోమల నివారణకు తమ వంతు తాము చర్యలు తీసుకోవాలని గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా వేపాకు పొగ వేయాలని, ఇంటి చుట్టూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ జ్వరం వస్తే వెంటనే ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందాలని తెలిపారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన ఓటర్ల నమోదు చేపట్టండి :తహశీల్దార్

**ప్రజాశక్తి- బంగారుపాల్యం:** నూతన ఓటర్ల నమోదు హక్కు చేపట్టాలని తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ల నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఇంటింటికి సర్వే పకడ్బందీగా చేయాలని 17 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతిఒక్కరూ కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. బూత్ స్థాయి అధికారులు, బిఎల్ఓ సహకారంతో తప్పనిసరిగా ఇంటింటి వెళ్లి పరిశీలించి కొత్త ఓటు నమోదు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని 17 ఏళ్ల నిండిన యువతీ యువకులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సూపర్వైజర్లు ఇబ్రహీం, లావణ్య, ఎలక్షన్ ఆపరేటర్ దుర్గ పాల్గొన్నారు.

విద్యారంగంలోని సమస్యలపై పోరాటం
## ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి- కుప్పం రూరల్:** కుప్పంలోని అన్ని రకాల ప్రభుత్వ విద్యాసంస్థల్లోని సమస్యలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు చేస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి, చిత్తూరు జిల్లా కన్వీనర్ వినోద్ తెలిపారు. బుధవారం వారి సమక్షంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా సతీష్ కుమార్, కార్యదర్శి నాగార్జున, ఉపాధ్యక్షులుగా లక్ష్మీనరసింహ, సిద్ధార్థ, పురుషోత్తం, సహాయ కార్యదర్శులుగా ఓంప్రసాద్, విజయ్, తరుణ్ కుమార్, తరుణ్, హరికృష్ణతోపాటు 25 మంది కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు పరిష్కారం కోసం పోరాటం చేస్తామని తెలిపారు.




## రాష్ట్ర వ్యాప్తంగా వనమహోత్సవం

డ్వామా పీడీ

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించి అడవులను సంరక్షించి భవిష్యత్తు తరాలకు సుస్థిర వాతావరణాన్ని కల్పించే సంకల్పంలో ప్రజలు మొక్కలు పెద్దఎత్తున నాటాలని పిలుపు నిస్తూ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వన మమోత్సవం 2024 కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించడం జరిగిందని డ్వామా పిడి రాజశేఖర్ తెలిపారు. బుధవారం ఉదయం చిత్తూరు నగరం, జీడీ నెల్లూరులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి పిడి, గురుకులాల డిసిఓ పద్మజ, ఇనిస్ట్యూషనల్ ప్లాంటేషన్ కింద పండ్ల మొక్కలు, కొబ్బరి మొక్కలు నాటడం జరిగింది. డ్వామా పిడి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనం నుండి మొక్కలు నాటడంలో ఆసక్తి కనబరిచి నాటిన మొక్కలు ఎదిగేంత వరకు సంరక్షించాలని చెట్లను పరిరక్షించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్ పద్మజ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఎంతగానో తోడ్పడు తుందన్నారు. జి.డి నెల్లూరు ప్రిన్సిపల్ దమయంతి, ఏపీడి సుబ్రహ్మణ్యం, అదనపు ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు, జూనియర్ ఇంజనీర్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

## పర్యావరణ రక్షణకు 'మట్టి గణపతి'

వాల్‌పోస్టర్ విడుదల చేసిన జేసి

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి పిలుపునిచ్చారు. బుధవారం జేసి తన ఛాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి తరపున తయారు చేసిన మట్టి గణపతికి జై.. పర్యావరణ రక్షణకు సై.. పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జేసి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టితో తయారు చేసిన గణపతిని పూజించాలన్నారు. మట్టి గణపతితో వినాయక చవితి విశిష్టతను పెంచేలా మనమందరం సమిష్టిగా కృషి చేయాలని, సహజ రంగులతో తయారు చేసిన మట్టి వినాయకుని విగ్రహాలను పూజించాలన్నారు. పండుగ నాడు లౌడ్ స్పీకర్‌లను వినియోగించి ధ్వని కాలుష్యం కలిగించరాదన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ అశోక్ కుమార్, ఏఈ మధన్ మోహన్‌రెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులపై అవగాహన

**ప్రజాశక్తి- గంగవరం:** మండలంలోని దండపల్లి ఆర్బికే కేంద్రంలో వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారిని సరిత తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త బి.సంధ్యారాణి, జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు టీవీ నాగపద్మ పాల్గొని రైతుల పంట పొలాల్లో వరి, వేరుశనగ ఇతర పంటలను పరిశీలించి ఆధునిక పద్ధతులలో వ్యవసాయం ఎలా చేయాలి, వాటికి కావలసిన ఎరువులు క్రిమిసంహారక మందులపై అవగాహన కల్పించారు. రైతులు పండించే పంటలు పోతదశలో అడవిపందులతో ఇబ్బందులు పడుతున్నామని, కొన్ని సందర్భాలలో పంటలు పూర్తిగా నాశనం చేసి వెళ్లిపోతున్నాయని వారికి వివరించారు. వీటిపై సంబంధిత అధికారులు చర్చించి వాటి నివారణ మార్గాలను దిశ నిర్దేశాలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు

## సంపూర్ణ పారిశుద్ధ్యం పై సమీక్ష

**ప్రజాశక్తి- శాంతిపురం:** సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమంపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏపీఆర్.కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేది నుండి మండలంలో సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టబడుతుందని, ఈకార్యక్రమం ద్వారా గ్రామ పంచాయతీలోని అన్ని గ్రామాలలో ముళ్ళ పొదలు తొలగించుట, మురుగునీటి కాలువలు శుభ్రం చేయుట, చెత్త కుప్పలను, పేడ దిబ్బలను తొలగించటం, తాగునీటి నాణ్యత పరిశీలన, ట్యాంకులు శుభ్రపరచుటం, పైపు లైను లీకేజీలను అరికట్టుట, ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ల మరమ్మతులు చేయుట వంటి పనులు పూర్తిస్థాయిలో చేయాలన్నారు.

## పౌష్టికాహార మాసోత్సవం ప్రారంభం

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** మండలంలోని నెల్లిపట్ల గ్రామపంచాయతీలోని ఆరు అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ మాధవీలత పౌష్టికాహార మాసోత్సవాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బైరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 184 అంగన్వాడీ కేంద్రాల్లో ఈనెల 30వ తేదీ వరకు పౌష్టికాహార మాసోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. అయా కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు, రక్తహీనత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాజా కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు తీసుకోవాలని సూచించారు. కౌమార దశలోని ఆడపిల్లలకు ఐరన్, పోలిక్ ఆసిడ్ సిరపులను అందిస్తున్నామని ఆడప్లిలలు రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రమాదేవి, అంగన్వాడీలు, ఆరోగ్య సిబ్బంది, బిపిసికె.ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఐఎంలో బిబిఏ సీట్ సాధించిన విద్యార్థి

**ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం:** మండలంలోని మారుమూల గ్రామమైన ఎన్ఎండి పురం గ్రామానికి చెందిన జల్లా చంద్రశేఖర్ రెడ్డి కుమార్తె జల్లా సోహన రెడ్డి దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మానేజ్మెంట్ బెంగళూరులో బిబిఏ (డిజిటల్ బిజినెస్ అండ్ ఎంట్రీప్రినార్షిప్) కోర్స్‌లో సీట్ సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జిల్లాలో ఈ ఘనత సాధించిన జల్లా సోహన రెడ్డి పలువురు కొనియాడి హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజల వద్దకే సమస్యల పరిష్కార వేదిక

**ప్రజాశక్తి- కుప్పం టౌన్ :** కమిషనర్ వార్డు బాట కార్యక్రమంలో మొదటిరోజు పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు పట్టణంలోని మొదటి వార్డు సామకోటపల్లిలో పర్యటించారు. ప్రజల వద్దకే సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్, కడా పిడి తదితర అధికారులు నిర్వహించే సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి పెద్దఎత్తున వస్తున్న వినతులను చూసి, వాటిలో చిన్నచిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలన్న ఉద్దేశంతో కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. పురపాలక సంఘం రాజ్ కుమార్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోపీనాథ్, సత్యేంద్ర శేఖర్, పాల్గొన్నారు.

## వైసీపీ జెండా ధ్వంసం

**ప్రజాశక్తి- పూతలపట్టు:** పూతలపట్టు మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన గత కొన్నేళ్ళుగా ఉన్న వైసీపీ జెండాను గుర్తి తెలీని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. జెండాకు ఏర్పాటు చేసిన ఇనుప పైపును విరిచి పార్టీ జెండాను చిందరవందర చేశారు. దీంతో మండల నాయకులు బాబు రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి మరి కొంతమంది సీఐ కృష్ణ మనోహర్ కు ఫిర్యాదు చేశారు. వెంటనే సంబంధిత వారిని అదుపులోకి తీసుకొని చర్యలు చేపట్టాలని కోరారు.

## చిన్నారులకు అన్నప్రాసన

**ప్రజాశక్తి- సోమల:** మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలలో బుధవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని తుడుంవారిపల్లి, రాంపల్లి, ఎర్రనాగులవారి పల్లి, ఇరికిపెంట గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించి గర్భవతులకు ప్రతినెలా అందజేసే కోడిగుడ్లు, పాలు, ఇతర పౌష్టికాహార వస్తువులను అందజేయడం జరిగిందని ఐసిడిఎస్ సూపర్వైజర్ హరిత తెలిపారు. గర్భవతులకు ఆహ్వానం, ప్రీ స్కూల్ సంసిద్ధత, పోషణ వేడుక, ప్రజారోగ్యం తదితర కార్యక్రమాలతో పాటు ప్రతినెలా నిర్వహించే కమ్యూనిటీ బేసెడ్ ఈవెంట్ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు.

## ఆరోగ్య సూత్రాలు పాటించాలి

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** మండలంలోని గడ్డూరు గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రభుత్వం వారు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అరుణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. అనంతరం పిల్లలకు శుభ్రత పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. భోజనం తినే ముందు చేతులు శుభ్రంగా కడుక్కొని భోజనం చేయాలని, ఇండ్ల వద్ద తల్లిదండ్రులకు చెప్పి మీ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయురాలు హేమలత, ఏఎన్ఎం సుజాత, ఆశా వర్కర్ ధనకొండమ్మ పాల్గొన్నారు.

## టి.గడ్డూరులో వైద్యసేవలు

**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** మండలంలోని టీగడ్డూరు గ్రామంలో బుధవారం డాక్టర్ అరుణ కుమార్ అధ్యక్షతన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా 13 మంది గర్భిణులు, ముగ్గురు బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అలాగే 38 మంది ఇతర వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వైద్యచికిత్సలతోపాటు రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. తీర్థం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది వీరికి మందులు పంపిణీ చేశారు.

## అనుమతులు తప్పనిసరి: సిఐ


**ప్రజాశక్తి- బంగారుపాళ్యం:** మండలంలో వినాయక స్వామి మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సిఐ శ్రీనివాసులు, ఎంపిడిఓ శివశంకర్ తెలిపారు. బుధవారం వినాయక చవితి మండల కమిటీల సభ్యులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో వినాయక స్వామి మండపాల ఏర్పాటు, విగ్రహాల ప్రతిష్ట, పూజా కార్యక్రమాలకు తప్పనిసరిగా అనుమతులు పొందాలని తెలిపారు. గ్రామాల్లో పోలీసుల తనిఖీ చేపట్టి అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు సహకరించండి

**ప్రజాశక్తి- కుప్పం రూరల్ :** పర్యావరణ పరిరక్షణకు ప్రజలు సహకరించాలని హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ రామలింగం కుప్పం ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని బస్టాండు ప్రాంగణంలో వారు ఉచితంగా మట్టి గణపయ్య విగ్రహాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రజల బాధ్యతగా గుర్తు చేస్తూ, రాబోవు వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపయ్య విగ్రహాలను పూజకు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మణి, లోకేష్, బాల తదితరులు పాల్గొన్నారు.

# లక్ష మొక్కలు నాటడమే లక్ష్యం..

**భూమి పై హక్కు మానవులతో పాటు ప్రతి జీవికి ఉంటుంది: జీవ శాస్త్ర ఉపాధ్యాయులు దేవేంద్ర**






**ప్రజాశక్తి- గంగవరం:** ఈ భూమిపైన నివసిస్తున్న మానవులతో పాటు ప్రతి జీవికి హక్కు ఉంటుందని గంగవరం ఉన్నత పాఠశాల జీవ శాస్త్ర ఉపాధ్యాయులు మల్లిచెట్ల దేవేంద్ర అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇప్పటివరకు 12,150 మొక్కలను పలమనేరు పరిసర ప్రాంతాలలో నాటడం, పంపిణీ చేయడం జరిగింది. నా లక్ష్యం లక్ష మొక్కలు నాటడం అని, ప్రకృతిని కాపాడుకోకుంటే మానవ మనుగడతోపాటు ఈ భూమిపైన జీవరాసులు కూడా కనుమరుగవుతాయి. ఈ భూమిపై హక్కు మానవులతో పాటు ప్రతి జీవికి ఉంటుందని తెలుసుకోకపోతే మొదటి ముప్పు మానవుడికే. దేవేంద్ర గుడిపాల మండలం చింతపార గ్రామానికి చెందిన రైతు కుటుంబంలో గురప్ప, సులోచన దంపతులకు జన్మించారు. చిన్ననాటి నుండి ప్రకృతి, వృక్షాలపై ఆసక్తి పెంచుకొని రకరకాల చెట్లను పెంచడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. గత 30 సంవత్సరాలుగా పలమనేరులోని పలు పాఠశాలల్లో జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ప్రస్తుతం గంగవరం ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తారు. ప్రస్తుత పరిస్థితులలో చెట్లు పూర్తిగా నశించిపోవడంతో వాతావరణ కాలుష్యం అధికమై ప్రజలు జీవరాశులు రోగాల పాలై నశించిపోతున్నాయని ఎంతో కొంత మార్పు తేవాలన్న ఉద్దేశంతో కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని చేపడుతూ ఉన్నానని ఆయన తెలిపారు. ఎక్కువగా అనేక రకాల పండ్ల చెట్లను విద్యార్థులకు మహిళలకు పంచి పెడుతూ తనవంతు ప్రయత్నిస్తున్నానని చెప్పారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ తమ పెరట్లో, పొలాల్లో చెట్ల పెంపకాన్ని చేపడతే వాతావరణంతో పాటు ఆరోగ్యంగా కూడా ఉండవచ్చని ఆయన చెబుతున్నారు.

# దార్శనికుడు.. ఉపాధ్యాయుడు..


**నేడు గురుపూజోత్సవం**

**విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తు చేసుకుందాం..**

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్**
గురువులకి గురువు సర్వేపల్లి రాధాకృష్ణన్ 136 సంవత్సరాల క్రితం 1888 సెప్టెంబర్ 5న మద్రాసు రాష్ట్రంలోని తిరుత్తణిలో తెలుగుదంపతులు సర్వేపల్లి వీరాస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించాడు. భారత దేశ మొదటి ఉప రాష్ట్రపతిగా ఓ సామాన్య కుటుంబంలో పుట్టిన ఉపాధ్యాయుడులు ఎదిగారు. ఉపాధ్యాయుడు ఎలా ఉండాలని భవిష్యత్తు తరాలకు బోధించి విద్య లక్ష్యం సంపాదన కాదు.. విజ్ఞానం కోసం విద్య అనే విషయాన్ని తెలియజేశారు. రోజుకు 18 గంటలు 11 పుస్తకాలు చదవడం రాయడంలో గడిపే రాధాకృష్ణన్ భారత రాయబారిగా పనిచేశారు. 21 సంవత్సరం కూడా దాటని వయస్సులో సర్వేపల్లి, మద్రాస్ రెసిడెన్షియల్ కాలేజీల్ ప్రొఫెసర్ అయ్యారు. తత్వశాస్త్రంలో అతని ప్రతిభకు మైసూరు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా నియమించింది. కోలకత్తా విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవి చేపట్టమని రవీంద్రనాథ ఠాగూరు లాంటి ప్రముఖులు కోరారు. అందుకు సమ్మతించి కోలకత్తా వెళ్ళాలని నిర్ణయించారు రాధాకృష్ణన్. ఆయన ఇంటిముందు గుర్రపు బండి సిద్ధంగా ఉన్నది. రైల్వే స్టేషన్ దాకా బందిని విద్యార్థులే లాక్కని వెళ్ళారు. ఇది శిష్యులకు గురువుపై గల భక్తి. కట్టమంచి రామలింగా రెడ్డి, మన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం లాంటి వారు కూడు ఉపాధ్యాయులను వృత్తి నుంచి వచ్చిన వారే.. సంవత్సరానికి ఓమారు సెప్టెంబర్ 5వ తేదీ గురుపూజ పేరిట రాధాకృష్ణన్ జన్మదిన పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రధానం చేస్తున్నారని జన విజ్ఞాన వేదిక చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు, ఏపీ ఎంఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గణిత అవధాని హెచ్. అరుణ శివప్రసాద్ అంటున్నారు..

# యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్**



**ప్రజాశక్తి- శాంతిపురం:** మండల పరిధిలోని రాళ్ళబూదుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో బెంగళూరు ఈజెడ్ఐ మార్ట్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం స్వయం ఉపాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, టిడిపి కుప్పం నియోజకవర్గ ఇన్చార్జి పిఎస్ మునిరత్నం, టిడిపి మండల అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామపరిధిలోనే ఆదాయం, ఉపాధి కలిగేలాగా ఒక నూతన కార్యక్రమాని తీసుకొచ్చేందుకు కృషి చేసిన కడా పిడి డైరెక్టర్ వికాస్ మర్మత్‌ను అభినందించారు. కుప్పం రూరల్ డెవలప్మెంట్ అథారిటీని తీసుకువచ్చి సంవత్సరానికి రూ.200కోట్లు కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరాజు, అధికారులు, టిడిపి నేతలు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలని చిత్తూరు ఆర్‌డిఓ చిన్నయ్య తెలిపారు. బుధవారం ఆర్‌డిఓ కార్యాలయంలో చిత్తూరు ఆర్‌డిఓ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై పోలీస్ అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వినాయక చవితి పండుగ నిర్వహణ, గణేష్ నిమర్జనం ఏర్పాట్లకు సంబంధించి వినతిపత్రాన్ని ఆర్‌డిఓకు అందించారు. ఆర్‌డిఓ మాట్లాడుతూ పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించుకోవాలని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. వినాయక విగ్రహాల నిమర్జనం కట్టమంచి చెరువులో మాత్రమే చేయాలని, చెరువు వద్ద సరిపడా బారికేట్లు, ఫోకస్ లైట్లు ఏర్పాటు, భక్తులకు తాగునీరు సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పండుగ నిర్వహణలో భాగంగా మొదటి రోజు నుండి మూడు పెద్ద క్రేన్లను ఏర్పాటు చేయాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలందరూ ఎంతో సంతోషముగా వినాయక చవితి జరుపుకోవాలని తెలిపారు. ఆర్డిఓ ఆఫీస్ ఏఓ రమేష్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ హమీద్, చిత్తూరు వన్‌టౌన్ సిఐ జయరామయ్య, వెస్ట్ సర్కిల్ శ్రీధర్ నాయుడు, కాణిపాకం ఎస్ఐ ధరణిధర్, కమిటీ సభ్యులు అట్లూరి శ్రీనివాసులు, సునీల్ కుమార్, కరుణకుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నయ్య

# రాయితీ ఉలవలు పంపిణీ

**ప్రజాశక్తి - రామకుప్పం:** రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రామకుప్పం మండల టీడిపి అధ్యక్షుడు ఆనంద రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉలవలను సబ్సిడీ ద్వారా రైతులకు టిడిపి నేతలు పంపిణీ చేశారు. రామకుప్పం, బందార్లపల్లి పంచాయతీల్లో 10 కేజీల ఉలువలను 174 రూపాయలకు అందించారు. అనంతరం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మొక్కలు నాటారు. చిన్నకృష్ణ, చలపతి, రామ్మూర్తి, నందారెడ్డి, సుబ్రీ, శ్రీనాథ్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, దయ, నియాజ్, వ్యవసాయ సిబ్బంది ఆనంద్, తిప్పే స్వామి పాల్గొన్నారు.

**శాంతిపురం:** మండలంలోని రాళ్ళబూదుగూరు రైతు సేవా కేంద్రంలో బుధవారం కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ రైతులకు ఉలువ విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పిఎస్ మునిరత్నం, మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ నాయుడు, రాళ్ళబూదుగూరు సర్పంచ్ లక్ష్మి మురుగేశ్, ఆర్ఎస్ మణి పాల్గొన్నారు.

**ఎస్ఆర్ పురం:** రాష్ట్ర ప్రభుత్వం 80శాతం రాయితీతో రైతులకు ఉలువలను అందిస్తుందని మండల వ్యవసాయ అధికారి నర్మదా తెలిపారు. మండలంలోని 13 సచివాలయలలో అర్హులైన రైతులకు ఉలవలను అందజేశారు. తయ్యూరు పంచాయతీ సెక్రెటరీ జ్యోష్ణ, వ్యవసాయ శాఖ సహాయకులు శివకుమార్ పాల్గొన్నారు.

**సదుం :** మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఉలవలు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ తెలిపారు. మండలానికి 102 క్వింటాళ్ల ఉలవలు ప్రభుత్వం కేటాయించిందని, ఉలవలు కావలసిన రైతులు ఆధార్ కార్డు, భూమి పాస్ బుక్ నకలు కాపీలతో రైతు భరోసా కేంద్రాల్లో బయోమెట్రిక్ పద్ధతి ద్వారా ఉలవలు తీసుకోవచ్చునని తెలిపారు.